



EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
శుక్రవారం
25-07-2025
పేజీలు: 02




## తల్లికి వందనం రానివారు ఆందోళన చెందవద్దు

రాష్ట్రంలో 9,10 తరగతులు, ఇంటర్ చదువుతున్న షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు తమకు తల్లికి వందనం రాలేదని ఆందోళన చెందవద్దని సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ లావణ్య వేణి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆమె గురువారం ఒక ప్రకటన చేశారు. 'పైన పేర్కొన్న తరగతుల్లో రాష్ట్రంలోఎస్సీ విద్యార్థులు 3.93 లక్షల మంది ఉన్నారు. తల్లికి వందనం పథకంలో వారికి సంబంధించిన కొంత వాటాను కేంద్రం భరిస్తుంది. కేంద్రం వాటా సొమ్ము బ్యాంక్ లింకేజీ అయిన విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో మరో 20 రోజుల్లో జమవుతుంది' అని లావణ్య వేణి తెలిపారు.

# ఫైనల్లో హంపి



ఎన్నో ఏళ్లుగా ఊరిస్తున్న మహిళల చెస్ వరల్డ్‌కప్ భారత్‌కు దక్కడం ఖాయమైంది. తెలుగు క్రీడాకారిణి కోనేరు హంపి అద్భుత విజయంతో ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన హోరాహోరీగా సాగిన సెమీస్‌లో హంపి 5-3తో చైనా జీఎం లీ టింగ్జీని ఓడించింది. అంతకుముందు జరిగిన రెండు క్లాసిక్ గేమ్‌లు 1-1తో డ్రా అయ్యాయి. ఇక టైబ్రేక్‌లో 15 నిమిషాల తొలి రెండు ర్యాపిడ్ గేమ్‌లు టై అయ్యాయి. ఆ తర్వాత జరిగిన 10 నిమిషాల ర్యాపిడ్ గేముల్లోని తొలి పోరులో టింగ్జీ గెలిచింది. మిడిల్ గేమ్‌లో పాన్‌ను చేజార్చుకొన్న కోనేరు.. ఎండ్ గేమ్‌లో ఇబ్బందుల్లో పడింది. దీంతో రెండో గేమ్‌ను డ్రా చేసుకుంటే చాలు...లీ ఫైనల్‌కు చేరుతుంది. అందుకు తగ్గట్టుగానే టింగ్జీ బోర్డుపై పట్టుబిగించింది. గేమ్ దాదాపుగా డ్రాకు చేరువైంది. కానీ, పట్టువదలకుండా పోరాడిన హంపి.. ఆ గేమ్‌ను గెలిచి 3-3తో సమం చేసింది. ఆ తర్వాత జరిగిన మూడో సెట్‌లోని రెండు బ్లిట్జ్ గేముల్లో భారత జీఎం పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. తొలి గేమ్‌లో తెల్లపావులతో ఆడిన హంపి.. లీని చిత్తు చేసింది. ఇక రెండో గేమ్‌ను డ్రా చేసుకొంటే హంపి ఫైనల్ చేరినట్టే. కానీ, సాంకేతికంగా మెరుగైన స్థితిలో ఉన్న కోనేరు.. టింగ్జీ ఆటకట్టించింది. దీంతో ఫైనల్ బెర్త్ దక్కించుకున్న హంపి.. టీనేజ్ ఐఎం దివ్య దేశ్‌ముఖ్‌తో అమీతుమీకి సిద్ధమైంది. బుధవారం నాటి పోరులో నెగ్గిన దివ్య ఫైనల్‌కు చేరిన సంగతి తెలిసిందే. ఫైనల్ శనివారం నుంచి జరుగుతుంది.



## నష్టాలతో ప్రారంభమైన స్టాక్ మార్కెట్

అంతర్జాతీయ మార్కెట్ల మిశ్రమ సంకేతాల నడుమ శుక్రవారం దేశీయ మార్కెట్లు నష్టాలతో ప్రారంభమయ్యాయి. ఉదయం 9:40కి సెన్సెక్స్ 361 పాయింట్లు పడిపోయి 81,818 వద్ద, నిఫ్టీ 124 పాయింట్లు తగ్గి 24,937 వద్ద ట్రేడింగ్ మొదలుపెట్టాయి. రూపాయి మారకం విలువ 86.57 వద్ద ఉంది. నిఫ్టీలో ఎస్‌బీఐ లైఫ్, డాక్టర్ రెడ్డీస్, అపోలో హాస్పిటల్స్ లాభాల్లో ఉండగా, బజాజ్ ఫైనాన్స్, నెస్లే, బజాజ్ ఆటో నష్టాల్లో ఉన్నాయి.




## యశ్ దయాళ్‌పై మరో లైంగిక వేధింపుల కేసు

ఆర్‌సిబి బౌలర్ యశ్ దయాల్ తనపై అత్యాచారం చేశాడని అరోపణలతో రాజస్థాన్‌లోని పోలీస్ స్టేషన్‌లో ఓ యువతి ఫిర్యాదు చేసింది. ఐపిఎల్ మ్యాచుల సందర్భంగా సదరు యువతి జైపూర్‌లోని యశ్ దయాళ్‌ను కలిసింది. క్రికెట్ కెరీర్ లో సలహాలు ఇస్తానని చెప్పి సీతాపురంలోని ఓ హోటల్‌కు తీసుకెళ్లాడు. అనంతరం తనపై అత్యాచారం చేశాడని ఫిర్యాదులో పేర్కొంది. గత రెండు సంవత్సరాల నుంచి బ్లాక్ మెయిల్ చేస్తూ తనపై అత్యాచారం చేస్తున్నాడని ఆరోపణలు చేసింది. అమ్మాయి వయసు 17 సంవత్సరాలు కావడంతో పోక్సో యాక్టు కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నేరం రుజువైతే యశ్ దయాల్ కు పదేళ్ల శిక్ష పడే అవకాశం ఉంది. గతంలో ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం ఘజియాబాద్‌కు చెందిన ఓ యువతి తనపై యశ్ అత్యాచారం చేశాడని ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఐపిఎల్ 2022లో గుజరాత్ టైటాన్స్ తరుపున ఆడి ఎంట్రీ ఇచ్చాడు. 2025లో ఆర్‌సిబి జట్టు కీలక బౌలర్ మారడంతో 13 వికెట్లు తీసి ఆర్‌సిబి కప్పు గెలవడంతో కీలకంగా వ్యవహరించాడు.



## కుప్పకూలిన ప్రభుత్వ పాఠశాల భవనం.. నలుగురు చిన్నారులు మృతి

రాజస్థాన్‌లోని ఝూలవర్‌లో ప్రభుత్వ పాఠశాల భవనం కుప్పకూలింది. దీంతో నలుగురు చిన్నారులు మరణించారు. శుక్రవారం ఉదయం 8.30 గంటల సమంయంలో ఝూలవర్ జిల్లా మనోహర్ థానాలోని పిప్లోడి ప్రభుత్వ పాఠశాల ఒక్కసారిగా కూలిపింది. నలుగురు చిన్నారులు అక్కడికక్కడే మరణించగా, మరో 40 మంది విద్యార్థులు శిథిలాల కింద చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న అధికారులు, సహాయక సంబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింది చిక్కుకున్న వారిని రక్షించేందుకు యత్నిస్తున్నారు. కాగా, శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనంపై గ్రామస్తులు ఇప్పటికే పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయినప్పటికీ ఎవరూ పట్టించుకోకపోవడంతో వర్షం కారణంగా బిల్డింగ్ గోడ కూలిపోయింది. దీంతో ప్రమాదం జరిగిందని స్థానికులు వెల్లడించారు.

## ఎంపీ మిథున్ రెడ్డికి షాక్



ఏపీ లిక్కర్ స్కాంలో అరెస్ట్ అయిన వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి మరోసారి నిరాశ మిగిలింది. ఈ కేసులో దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణను 29కి కోర్టు వాయిదా వేసింది. దీంతో మిథున్ రెడ్డి మరో నాలుగు రోజులు జైల్లోనే ఉండే పరిస్థితి ఎదురైంది. కాగా, మద్యం కుంభకోణం కేసులో ఆయన అరెస్ట్ అయి ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న సంగతి తెలిసిందే.ఇదిలా ఉంటే, వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి సహాయకుడిని ఏర్పాటు చేయాలంటూ ఇటీవల ఏసీబీ కోర్టు ఇచ్చిన ఆదేశాలపై ఇప్పుడు రాజమండ్రి జైలు సూపరింటెండెంట్ రాహుల్ రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు. జైలులో ఖైదీలకు సహాయకుల్ని ఏర్పాటు చేసే నిబంధనలు లేవని, కోర్టు ఆదేశాల్లో ఉన్న మార్గదర్శకాలను పునః పరిశీలించాలని ఆయన కోరారు. జైలు నిబంధనల ప్రకారం ఒక ఖైదీ తన పనులు తాను చేసుకోలేని స్థితిలో ఉన్నా, లేదా తీవ్రమైన అనారోగ్యానికి లోనైతే తప్ప ప్రత్యేక సహాయకుడిని నియమించే అవకాశం లేదని, అటువంటి పరిస్థితుల్లో జైలులో ఉన్న ఎంఎన్వో లేదా ఎఫ్ఎన్వో సహాయ సిబ్బందిని ఉపయోగిస్తామని పిటిషన్‌లో పేర్కొన్నారు.

## రాజ్యసభ ఎంపీగా కమల్‌హాసన్ ప్రమాణస్వీకారం



నటుడు, మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) అధినేత కమల్ హాసన్ రాజ్యసభ ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు తమిళనాడు నుంచి మరో ఐదు మంది.. డీఎంకే నుండి పి. విల్సన్, సల్మా, ఎస్.ఆర్. శివలింగంతో పాటు మరికొంత మంది ప్రమాణస్వీకారం చేశారు. గత జూన్‌లో డీఎంకే కూటమి మద్దతుతో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో వీరు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా 2018లో ఎంఎన్ఎం పార్టీని స్థాపించిన కమల్ హాసన్..2021 తమిళనాడులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమికి మద్దతు ప్రకటిస్తూ.. డీఎంకేకు తమ పార్టీ మద్దతును ప్రకటించారు. ఈ ఎన్నికల్లో కూటమి విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. డీఎంకే పార్టీ తమిళనాడులో తమ పార్టీ జెండా ఎగురవేసింది. ప్రస్తుతం తమిళనాడు అసెంబ్లీలో డీఎంకేకు 134 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. దీంతో నాలుగు రాజ్యసభ స్థానాలనూ ఆ పార్టీనే దక్కించుకుంది. పొత్తులో భాగంగా 2025 రాజ్యసభ ఎన్నికల్లో ఎంఎన్ఎం పార్టీకి రాజ్యసభ స్థానం ఇచ్చేందుకు డీఎంకే నేతృత్వంలోని కూటమి అంగీకరించింది. ఈ నేపథ్యంలో కమల్ హాసన్ రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## హాట్‌గా భాగ్యశ్రీ



నేచురల్ స్టార్ నాని నటించనున్న 'ది ప్యారడైజ్' చిత్రానికి సంబంధించిన కాస్టింగ్ పనులు ఊపందుకున్నాయి. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ప్రస్తుతం ఈ సినిమాలో నాని సరసన నటించేందుకు తగ్గ హీరోయిన్ కోసం పరిశీలన జరుపుతున్నాడు. ఈ క్రమంలో భాగ్యశ్రీ బోర్సేను హీరోయిన్‌గా ఫిక్స్ చేసినట్లు సమాచారం. ఇప్పటికే పలు టాప్ యంగ్ హీరోల పక్కన నటిస్తున్న ఆమెకి మంచి క్రేజ్ ఉండటంతో, ఈ క్రేజ్ తమ సినిమాకి బలంగా ఉపయోగపడుతుందని మేకర్స్ భావిస్తున్నారట. త్వరలో అధికారిక ప్రకటన వెలువడనుందని ఫిల్మ్‌నగర్ వర్గాలు చెబుతున్నాయి.

## బ్రిటన్‌లో బీమా సొమ్ము కోసం ఓ వైద్యుడు తన కాళ్లను తొలగించుకున్నాడు

బ్రిటన్‌లో బీమా సొమ్ము కోసం ఓ వైద్యుడు తన కాళ్లను తొలగించుకున్నాడు. 5 లక్షల పౌండ్లు వస్తాయన్న ఆశతో ఆయన రెండు మోకాళ్ల కింది భాగాన్ని తొలగించుకున్నాడు. భారతీయ కరెన్సీలో ఈ బీమా విలువ రూ.5.4 కోట్లు. దీనిపై బీమా సంస్థలు కోర్టును ఆశ్రయించాయి.నెయిల్ హోవర్ అనే వ్యక్తి ఉద్దేశపూర్వకంగానే తన రెండు మోకాళ్లను తొలగించుకున్నాడని బీమా సంస్థలు ఆరోపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ కేసు విచారణ దశలో ఉంది.బీమా డబ్బుల కోసం ఇతరుల కాళ్లను కూడా తొలగించేలా మారియస్ గుత్సావ్‌సన్ అనే వైద్యుడిని నెయిల్ ప్రోత్సహించారనే అభియోగాలు వచ్చాయి. దీంతో అధికారులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టారు. ఈ విచారణలో దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వచ్చాయి.శరీరానికి హాని కలగకుండా మోకాళ్లను ఎలా తొలగించుకోవచ్చనే దానిపై నెయిల్ ఒక వెబ్‌సైట్ నుంచి కొన్ని వీడియోలను కొనుగోలు చేసినట్లు గుర్తించారు. వాటి ఆధారంగా మరో వైద్యుడి సహకారంతో తన రెండు కాళ్లను తొలగించుకున్నాడు. ఆ తర్వాత బీమా క్లెయిమ్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు.తనకు రక్తనాళాల సమస్య ఉందని, మోకాళ్లను తొలగించుకోకపోతే అది శరీరమంతా వ్యాపిస్తుందని బీమా సంస్థలను నమ్మించే ప్రయత్నం చేశాడు. అయితే, ముందుగా సమాచారం ఇవ్వలేదనే కారణంతో బీమా సంస్థలు అతని క్లెయిమ్‌లను తిరస్కరించాయి. అదే సమయంలో మారియస్ గుత్సావ్‌సన్ వ్యవహారం కూడా వెలుగులోకి రావడంతో పోలీసులు నెయిల్‌ను అరెస్టు చేశారు.అయితే, ఇటీవల ఒక అంతర్జాతీయ మీడియాతో నెయిల్ మాట్లాడుతూ, తన అనారోగ్యం కారణంగానే



కాళ్లు తొలగించుకోవాల్సి వచ్చిందని చెప్పాడు. వైద్య నిపుణుల సూచన మేరకు ఆపరేషన్ చేయించుకున్నట్లు తెలిపాడు. కాళ్లు ఉన్నప్పటి కంటే కోల్పోయిన తర్వాతనే తన జీవితం బాగుందని ఆయన పేర్కొన్నారు.

EVENING EDITION
శుక్రవారం | 25 జూలై 2025
www.suryaa.com
4 PM
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4 PM

# అమర్‌నాథ్ యాత్ర.. 21 రోజుల్లో 3.5 లక్షల మంది దర్శనం

అమర్‌నాథ్ యాత్ర పోటెత్తుతున్నారు. ఈ యాత్ర ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకూ దాదాపు 3 లక్షల మందికిపైగా మంచు లింగాన్ని దర్శించుకున్నారు. జులై 2న యాత్ర ప్రారంభమైనప్పటి నుంచి గురువారం వరకూ అంటే జులై 24వ తేదీ వరకూ 21 రోజుల్లో 3.5 లక్షల మందికిపైగా భక్తులు మంచు లింగాన్ని దర్శించుకున్నట్లు అధికారులు తాజాగా వెల్లడించారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో అమర్‌నాథ్ యాత్రకు జమ్ము ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగానే యాత్ర మార్గంలో నో ఫ్లైయింగ్ జోన్‌గా ప్రకటించింది. దీంతో యాత్రికులు దక్షిణ కశ్మీర్‌లోని పహల్గాం, ఉత్తర కశ్మీర్‌లోని బాల్తాల్ మార్గం నుంచి కాలినడకన, లేదా పోనీల సాయంతో మంచు లింగం వద్దకు చేరుకుంటున్నారు. ఈ ఏడాది జులై 2న ప్రారంభమైన ఈ యాత్ర 38 రోజులపాటు సాగనుంది. ఆగస్టు 9న శ్రావణ పూర్ణిమ రోజున ముగియనుంది. ఈ ఏడాది దాదాపు 5 లక్షల మందికిపైగా భక్తులు మంచు లింగాన్ని దర్శించుకోనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.






## పీహెచ్‌సీ, అంగన్‌వాడీల్లో ఆధార్ ప్రత్యేక క్యాంపులు..

ఆధార్ ఇప్పుడు అందరికీ తప్పనిసరిగా మారింది. పెద్దవాళ్లకే కాదు.. చిన్న పిల్లలకు కూడా ఆధార్ అవసరమే. ఆధార్ కార్డు లేకపోతే స్కూళ్లలో అడ్మిషన్ల కూడా ఇవ్వడం లేదు. ఈ విషయంపై సరైన అవగాహన లేక పిల్లలను పాఠశాలలో చేర్పించే సమయంలో తల్లిదండ్రులు ఇబ్బందులకు గురవుతున్నారు. బడి ప్రారంభ సమయంలో ఆధార్ సేవా కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. అలా అందరూ ఒకే సమయంలో రావడంతో ఆధార్ సేవా కేంద్రాలు రద్దీగా మారుతున్నాయి. అప్పుడు ఆధార్ కార్డుల కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తుంది. ఈ పరిస్థితిని అర్థం చేసుకున్న ప్రభుత్వం.. పుట్టిన చోటే శిశువులకు ఆధార్ కార్డులు జారీ చేసేలా చొరవ తీసుకుంది. ఏపీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల్లో కొంతకాలంగా ప్రత్యేకంగా శిశు ఆధార్ సేవా కేంద్రాలను నిర్వహిస్తోంది.




## కోడలిని లక్ష రూపాయలకు అమ్మేసిన అత్తమామలు

అత్తామామలు కోడలిని లక్ష రూపాయలకు అమ్మేశారు. ఈ సంఘటన మహారాష్ట్రలోని యావత్మల్ జిల్లాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం‌_ _ _ అర్ని పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ గ్రామంలో ఓ మహిళ భర్త, అత్తమామలతో కలిసి ఉండేది. భర్త చనిపోవడంతో అత్తమామతో కలిసి కోడలు ఉంటుంది. అత్తమామలు కోడలిని గుజరాత్‌కు చెందిన ఓ వ్యక్తికి రూ1.25 లక్షలకు అమ్మేశాడు. అతడు రెండు సంవత్సరాలు శారీరకంగా, మానసికంగా వాడుకొని, ఓ బిడ్డకు జన్మనిచ్చిన తరువాత అత్తమామల వద్ద వదిలి వెళ్లిపోయాడు. దీంతో బాధితురాలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని నలుగురిని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు.



## 62 ఏళ్ల వ్యక్తికి అరుదైన సర్జరీ..

సంక్లిష్టమైన బైలేటరల్ ప్రాక్సిమల్ హ్యూమరస్ ఫ్రాక్చర్ సర్జరీని 62 ఏళ్ల వ్యక్తికి బంజారాహిల్స్ లోని రెనోవా సెంచరీ ఆస్పత్రి వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలను ఆర్థోపెడిక్ సర్జన్ చీఫ్ ట్రామా సర్జన్ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, షోల్డర్ స్పోర్ట్స్ సర్జన్ డా.అనూప్ రెడ్డి సామ వివరించారు. ఖమ్మం జిల్లా, ఖానాపురం హవేలి, రోటరీ నగర్‌కు చెందిన 62 ఏళ్ల వ్యక్తి జారి పడిపోయిన ఘటనలో రెండు భుజాలకు గాయమై చేతులను కదపలేని స్థితికి చేరుకున్నాడు. అతన్ని రెనోవా సెంచరీ ఆస్పత్రికి తీసుకురాగా, పరిశీలించిన ఆర్థోపెడిక్ ఆంకోసర్జన్ విభాగం అధిపతి డాక్టర్ హిమకాంత్ లింగాలతో పాటు తాము, తమ సహచర వైద్య బృందం చికిత్సను ప్రారంభించామన్నారు. కుడి భుజానికి రైట్ రివర్స్ షోల్డర్ ఆర్థోప్లాస్టీ (ఈ ప్రక్రియలో, ఎముక నిర్మాణాన్ని మార్చడం ద్వారా భుజం బంతి, కఫ్ స్థానాన్ని తిరగవేసి, భుజం కదలికను మెరుగుపరచడం), ఆ తరువాత ఫిలోస్ ప్లేట్ ఫిక్సేషన్ ఉపయోగించి ఎడమ భుజానికి ఓపెన్ రిడక్షన్ అండ్ ఇంటర్నల్ ఫిక్సేషన్ సర్జరీని పూర్తి చేసినట్లు వివరించారు. రోగి త్వరగానే కోలుకుని వారం రోజుల్లోనే డిశ్చార్జ్ అయ్యారన్నారు. ఈ సమావేశంలో వైద్యులు సుహాస్ మసిలామణి, విష్ణు, రవీంద్రనాథ్ గరగ పాల్గొన్నారు.

## హాట్ దిశా

తెలుగులో ఎంతో మంది ముద్దుగుమ్మలు తమ అందచందాలతో, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కానీ ఆతర్వాత టాలీవుడ్ కు దూరం అయ్యారు. తెలుగులో కొన్ని సినిమాలే చేసి ఆ తర్వాత బాలీవుడ్ కు చెక్కేసినవారు చాలా మంది ఉన్నారు. కొంతమంది ముద్దుగుమ్మలు ఒకటి రెండు సినిమాలతోనే పరిమితం అవుతున్నారు. పెళ్లి చేసుకొనో.. లేక అవకాశాలు లేక సినిమాలకు దూరం అయ్యారు. ఒక ముద్దుగుమ్మ తెలుగులో రెండే సినిమాలు చేసింది. అందులో ఒకటి డిజాస్టర్ కాగా ఓ సినిమా సంచలన విజయం సాధించింది. కానీ ఈ బ్యూటీకి ఆఫర్స్ మాత్రం లేదు. ఇప్పుడు ఒకొక్క సినిమాకు రూ. 3 కోట్లు వసూల్ చేస్తుంది ఈ చిన్నది. అలాగే ఆమె ఆస్తి పాస్తులు కూడా కోట్లల్లో ఉన్నాయి. అంతే కాదు ఇండస్ట్రీలో ఆమెను మించిన హాట్ బ్యూటీ లేదు.




## సమోవాలో భారీ భూకంపం

సమోవా ద్వీపంలో శుక్రవారం ఉదయం భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 6.6గా ఉందని అమెరికా జియోలాజికల్ అధికారులు వెల్లడించారు. సమోవా వాయువ్య దిశలో 400 కిలో మీటర్ల దూరంలో 314 కిలో మీటర్ల భూకంప కేంద్రం ఉందని ప్రకటించారు. భూప్రకంపనలు చోటుచేసుకోవడంతో ప్రజలు ఇండ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఎలాంటి సునామీ హెచ్చరికలు జారీ చేయలేదు. భారీగా ఆస్తి నష్టం జరిగినట్టు సమాచారం.

## నేడు జరగాల్సిన క్యాబినెట్ భేటీ వాయిదా



శుక్రవారం మధ్యాహ్నం జరగాల్సిన మంత్రి మండలి సమావేశం వాయిదాపడింది. ముఖ్యమంత్రి సహా కొందరు మంత్రులు అందుబాటులో లేకపోవడంతో క్యాబినెట్ భేటీని ప్రభుత్వం వాయిదావేసింది. ఈ సమావేశాన్ని ఈ నెల 28న మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించాలని నిర్ణయించింది. ఢిల్లీలో జరుగుతున్న ఏఐసీసీ ఓబీసీ నేషనల్ కాన్ఫరెన్స్ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి పాల్గొంటున్నారు. వీరితోపాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఢిల్లీలోనే ఉన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపు బిల్లుపై ఇండియా కూటమి ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా అక్కడే ఉన్నారు. సీఎంతోపాటు మొత్తం ఐదుగురు మంత్రులు ఢిల్లీలో ఉండటంతో క్యాబినెట్ సమావేశానికి కోరం ఉండకపోవచ్చన్న అంచనాతో వాయిదా వేసినట్లు తెలుస్తున్నది.

## సింధుకు హుడా షాక్

చైనా ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 100 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత యువ షట్లర్ ఉన్నతి హుడా పెను సంచలనం సృష్టించింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ఉన్నతి ఉత్కంఠ పోరులో స్టార్ షట్లర్ పి.వి.సింధును మట్టికరిపించింది. ఆసక్తికరంగా సాగిన పోరులో హుడా 2116, 1921, 2113తో సింధును ఓడించింది. ఆరంభం నుంచే పోరు నువ్వానేనా అన్నట్టు సాగింది. తొలి సెట్‌లో హుడా దూకుడును ప్రదర్శించింది. సింధు జోరు ను తట్టుకుంటూ సెట్‌ను తన ఖాతాలో వేసుకుంది. రెండో సెట్‌లో కూడా హోరాహోరీ తప్పలేదు. ఇటు సింధు అటు ఉన్నతి ప్రతి పాయింట్ కోసం సర్వం ఒడ్డారు. చివరి వరకు నువ్వానేనా అన్నట్టు సాగిన పోరులో సింధు జయకేతనం ఎగుర వేసిం ది. ఇక ఫలితాన్ని తేల్చే మూడో సెట్‌లోనూ ఇద్దరు నువ్వానేనా అన్నట్టు తలపడ్డారు. అయితే ఆఖరి వరకు నిలకడైన ఆటను కనబరిచిన ఉన్నతి సెట్‌తో పాటు మ్యాచ్‌ను గెలిచి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. కాగా, పురుషుల సింగిల్స్‌లో భారత స్టార్ షట్లర్ హెచ్ఎస్ ప్రణయ్ ప్రిక్వార్టర్ ఫైనల్లోనే ఇంటిదారి పట్టాడు. ఆసక్తికరంగా సాగిన పోరులో ప్రణయ్ తైవాన్ షట్లర్ చౌ చేతిలో పోరాడి ఓడాడు.






## మాల్దీవ్స్ చేరుకున్న ప్రధాని మోదీ.. స్వాగతం పలికిన మొయిజు

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విదేవీ పర్యటన కొనసాగుతోంది. ఇందులో భాగంగా ప్రధాని ఇవాళ మాల్దీవుల పర్యటనకు వెళ్లారు. రెండు రోజులపాటూ (25-26) మాల్దీవ్స్‌లో మోదీ పర్యటించనున్నారు. ఇవాళ ఉదయం మాలే చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ మొయిజు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాలే ఎయిర్‌పోర్ట్‌లో వందేమాతరం, భారత్ మాతాకీ జై వంటి నినాదాలు వినిపించాయి. అధ్యక్షుడు డాక్టర్ మొహమ్మద్ మొయిజు ఆహ్వానం మేరకు ప్రధానమంత్రి మోదీ మాల్దీవుల పర్యటనకు వెళ్లారు. ఆ దేశంలో మోదీ పర్యటించడం ఇది మూడోసారి. మొయిజు మాల్దీవులలో అధికారం చేపట్టిన తర్వాత ఒక విదేశీ దేశాధినేత తొలి పర్యటన ఇదే కావడం విశేషం.